సాక్షి నారాయణపేట

శుక్రవారం ၊ 28 ၊ ఫిబ్రవరి ၊ 2025



కల్యాణ వైభోగం

బాలబ్రహ్మేశ్వర, జోగులాంబ కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

వివరాలు 8లో ▸



కలగానే సింథటిక్ ట్రాక్?

ప్రధాన స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణానికి నోచుకోవడం లేదు.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.2 /15.7

వాతావరణం

మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం తర్వాత చలి తీవ్రత నమోదవుతుంది.

జనరల్ ఆస్పత్రి @ 900

అదనంగా 250 బెడ్స్ ఏర్పాటు చేసుకోవాలని ఎన్ఎంసీ ఆదేశాలు

- ఇప్పటికే డీఎంఈకి అందిన ఉత్తర్వులు
- రెండు నెలల్లో ప్రక్రియ పూర్తి చేయడానికి కసరత్తు
- వసతులు సమకూరినా.. ఖాళీల భర్తీపై దృష్టిపెట్టని ప్రభుత్వం
- అరకొర వైద్యులతో రోగులకు మెరుగుపడని వైద్యసేవలు



పాలమూరు: ఉమ్మడి మహబూబ్‌నగర్ పేద ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్న జనరల్ ఆస్పత్రి 650 పడకల నుంచి 900 పడకలకు అప్‌గ్రేడ్ అయ్యింది. కొత్తగా మరో 250 పడకలు అదనంగా పెంచుకోవడానికి ఎన్ఎంసీ అంగీకరించినట్లు రెండ్రోజుల కిందట డీఎంఈకి ఉత్తర్వులు అందాయి. మరో రెండు నెలల్లో 900 పడకలకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేయడానికి అధికార యంత్రాంగం కసరత్తు చేపడుతోంది. పెరిగిన పడకల నేపథ్యంలో సరిపడా వైద్యుల దగ్గరి నుంచి నాలుగో తరగతి, పారా మెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు. పడకల పెంపుపై ప్రభుత్వ వర్గాల నుంచి అధికారికంగా ఉత్తర్వులు రావాల్సి ఉంది. అదేవిధంగా ప్రస్తుతం 13 విభాగాల్లో 28 పీజీ సీట్లు ఉండగా ఇటీవల అర్థోకు 4, ఈఎన్‌టీ విభాగానికి 3 పీజీ సీట్లు దరఖాస్తు చేయగా వాటికి సైతం మార్చి మొదటి వారంలో అనుమతి ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. పడకల పెంపుతో జనరల్ ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగుపడతాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

పని ఒత్తిడి తట్టుకోలేక..

జనరల్ ఆస్పత్రిగా మార్పు చెందిన తర్వాత 350 నుంచి 550 పడకలకు, ఆ తర్వాత 650 పడకల సామర్థ్యం పెరిగింది. దీంతో రోజువారి ఓపీతోపాటు ప్రసవాలు, అడ్మిట్ అవుతున్న రోగుల సంఖ్య క్రమంగా పెరిగింది. అయితే జిల్లా వైద్య కళాశాల అనుమతి వచ్చిన తర్వాత ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం ఉండాల్సిన పారామెడికల్ సిబ్బంది ఇప్పటి వరకు భర్తీ చేయలేదు. ఆస్పత్రిలో ఉండే ప్రధాన విభాగాలకు మూడు షిఫ్టుల వైద్యులు ఉండాలి. ప్రస్తుతం పనిచేస్తున్న వైద్య సిబ్బంది సరిపోవడం లేదు. దీనికితోడు జిల్లా జనరల్ ఆస్పత్రికి వైద్య సిబ్బంది 459 మంది అవసరం ఉంటే.. ఇప్పటికీ 200లోపు మాత్రమే ఉన్నారు. ఇలా పని ఒత్తిడి తట్టుకోలేక వైద్యులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అన్ని విభాగాల్లో ఎస్ఆర్‌లు లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి.

అనేక కొత్త సమస్యలు

జనరల్ ఆస్పత్రి తాజా పరిస్థితిని పరిశీలిస్తే మళ్లీ కథ మొదటికి వచ్చే ప్రమాదం లేకపోలేదు. పడకల పెంపుతో అనేక కొత్త సమస్యలు వచ్చి పడ్డాయి. అరకొర సిబ్బందితో ఇబ్బందులు పడుతున్న సమయంలో ఉన్నవారు పని చేయలేమంటూ వాపోతున్నారు. ఇక కాంట్రాక్టు వైద్యులు తమ వల్ల కూడా కాదంటూ ఇప్పటికే కొందరు తప్పుకున్నారు. ఇక ఆస్పత్రిని ఒంటిచేతిపై నడిపిన ఎస్ఆర్‌లు సైతం లేకపోవడంతో ఇబ్బందులు పెరిగి.. జనరల్ ఆస్పత్రి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఇప్పుడున్న పరిస్థితిలో ఖాళీగా ఉన్న పోస్టులు అన్నింటిని భర్తీ చేస్తే తప్ప రోగులకు మెరుగైన సేవలు అందే అవకాశం కనిపించడం లేదు. ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి దవాఖానాల్లో వసతులు, ఆధునిక పరికరాలు సమకూర్చుతున్నా.. ఖాళీలపై దృష్టి పెట్టకపోవడంతో రోగులకు అంతంత మాత్రంగానే సేవలు అందుతున్నాయి.

జనరల్ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది పోస్టులు ఇలా..

కేడర్	మొత్తం పోస్టులు	రెగ్యులర్	కాంట్రాక్ట్	ఖాళీలు
ప్రొఫెసర్	22	14	1	7
అసోసియేట్	37	25	4	8
అసిస్టెంట్	60	28	12	20
ట్యూటర్స్	32	7	9	16
ఎస్ఆర్	30	-	4	26
జేఆర్	55	-	22	33
హెడ్‌నర్సులు	27	11	-	16
స్టాఫ్‌నర్సు	147	147	-	-

పరిపాలన, టెక్నికల్, నర్సింగ్ తదితర విభాగాల్లో ఇలా..

మొత్తం పోస్టులు	రెగ్యులర్ సిబ్బంది	కాంట్రాక్టు పద్ధతిలో	ఖాళీ పోస్టులు
407	211	87	109

ఆదేశాలు వచ్చాయి..



జనరల్ ఆస్పత్రి పడకల స్థాయి 650 నుంచి 900కు పెంచడానికి అన్ని రకాలుగా సిద్ధం కావడం జరిగింది. ఇప్పటికే ఎన్ఎంసీ నుంచి ఆదేశాలు వచ్చాయి. ప్రభుత్వం, డీఎంఈతో నుంచి అధికారికంగా రావాల్సి ఉంది. రెండు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి అయ్యే అవకాశం ఉంది. పడకలు పెరగడం వల్ల రోగులకు మరింత వైద్య సేవలు పెరుగుతాయి.

– సంపత్‌కుమార్‌సింగ్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్, మహబూబ్‌నగర్

పీజీలో కూడా సీట్లు



మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో 250 పడకలు అదనంగా పెంచుకోవడానికి అనుమతి రావడంతో పడకలు 900 చేరాయి. ప్రస్తుతం మెడికల్ కళాశాలలో 175 ఎంబీబీఎస్ సీట్లకు సరిపడా పడకలు ఆస్పత్రిలో అవసరం ఉన్నాయి. పీజీలో కూడా సీట్లు మరిన్ని పెరుగుతాయి. మార్చిలో ఈ అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

– రమేష్, మెడికల్ కళాశాల డైరెక్టర్, పాలమూరు

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: రానున్న వేసవిలో తాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో మిషన్ భగీరథ బడ్జెట్ పన్నుల వసూలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన మిషన్ భగీరథ తాగునీరు సరఫరా అవుతున్నాయని, రానున్న వేసవిలో ఏ ఇబ్బంది లేకుండా సరఫరా చేయాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే ముందుగానే తెలపాలని అధికారులను ఆదేశించారు. వేసవి యాక్షన్ ప్లాన్ ప్రకారం ముందుకు వెళ్లాలని తెలిపారు. నారాయణపేట, మక్తల్, కోస్గి, మద్దూరు మున్సిపాలిటీ కమిషనర్లను ఆయా మున్సిపాలిటీలలో తాగునీటి సరఫరాపై పూర్తి వివరాలు ఆరా తీశారు.అలాగే పన్నుల వసూళ్ల వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ పి.వెంకటరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

రంజాన్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలి

పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో సమావై రంజాన్ సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, కల్పించాల్సిన సౌకర్యాలపై సమీక్ష జరిపారు. ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లకు తావు లేకుండా జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రధానంగా ఎక్కడ తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి బాధ్యతలు పురమాయిస్తూ, నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రార్థనా సమయాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని, మసీదులు, ఈద్గాల వద్ద పారిశుద్ధ్య సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడ కూడా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, సమస్యాత్మక ప్రాంతాలలో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ బేన్‌షాలం, ఆర్డీఓ రాంచందర్ మాట్లాడుతూ.. మున్సిపల్ కమిషనర్లు రంజాన్ పండుగ రోజు షామియానాలు, తాగునీరు తదితర ఏర్పాట్లు చూడాలన్నారు. డీఎస్పీ లింగయ్య మాట్లాడుతూ రంజాన్, హోలీ, ఉగాది పండుగలకు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని, రంజాన్ నేపథ్యంలో ఈద్గాలో దాదాపు 10 వేల మంది ప్రార్థనలకు హాజరవుతారని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మైనారిటీ అధికారి ఎంఏ.రషీద్, డీఆర్డీఓ మొఘులప్ప, ట్రాన్స్‌కో డీఈ జితేందర్‌నాథ్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సమష్టి ప్రణాళికతోనే జిల్లా సస్యశ్యామలం



సదస్సులో పాల్గొన్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తదితరులు

నారాయణపేట: సమష్టి ప్రణాళికతోనే పాలమూరు సస్యశ్యామలం అవుతుందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రం సమీపంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మర్రి చెన్నారెడ్డి చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాగునీటి ప్రాధాన్యత లభ్యత, మూడు పంటలకు సాగు నీరు ఎలా ఇవ్వవచ్చు, ఇరిగేషన్ నిపుణులు హనుమంతరావు రూపొందించిన జల చతుర్భుజ అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజస్థాన్‌తో పాటు ఇటు తెలంగాణలోని జహీరాబాద్ నియోజకవర్గంలో బ్రహ్మాండంగా హనుమంతరావు కాన్సెప్ట్ అమలు అవుతోందన్నారు. ఈ విధానంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రాంతానికి సాగునీరు ఇవ్వవచ్చని, రూ.5 వేలతో ఎకరాకు సాగునీరు అందించవచ్చని, ఇది పెద్ద ఎత్తున అమలు చేస్తే మరిన్ని ఫలితాలు సాధించవచ్చన్నారు. పండించిన పంటకు ఖర్చు తగ్గించడంతో పాటు, చివరి ఆయకట్టుకు, సాగు నీరు ఇవ్వవచ్చు, రూ.వేల కోట్లు ఖర్చు పెట్టి కాళేశ్వరం నిర్మించినా కోటి ఎకరాలకు సాగునీరు ఇవ్వాలన్న లక్ష్యం మధ్యలోనే ఆగిపోయిందన్నారు. పాలమూరు రంగారెడ్డి పథకం తోనూ జిల్లాకు సాగునీరు ఇవ్వాలన్న లక్ష్యం నేటికీ నెరవేరలేదన్నారు. నీటి అప్రోచ్ జూరాల నుంచి తీసుకోవాలన్నది ప్రతిపాదన, ఈ పార్లమెంట్‌లోని ఏడు అసెంబ్లీల్లో ఒక్కో నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు నీరివ్వాలి అని, ఏళ్లు గడుస్తున్నా ఆ లక్ష్యం నెరవేరడం లేదన్నారు. ఇప్పటికైనా ఒక మంచి లక్ష్యంతో తీసుకొచ్చిన ఈ కాన్సెప్ట్‌ను రాష్ట్రంలో అమలు చేయాలని, వేలాది రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ ప్రాంత రైతుల అభ్యున్నతి, వారికి సాగునీటి ఇబ్బందులు తీర్చడమే నా లక్ష్యంగా, పార్లమెంట్ పరిధిలో ప్రతి ఎకరాకు సాగు నీరు అందించేందుకు కృషిచేస్తామన్నారు. త్వరలో పార్లమెంట్‌లో ఈ అంశాన్ని లేవనెత్తుతానన్నారు.

రైతులకు మేలు చేయడమే లక్ష్యం

ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి మాట్లాడుతూ ఈ విధానంపై సీఎంతో పాటు ఇరిగేషన్ మంత్రి దృష్టికి తీసుకెళ్లి రైతులకు మేలు చేసేవిధంగా చర్యలు చేపడతమన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే ఎస్.ఆర్ రెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డిలోని కోయర్ నిర్వహించే ఈ విధానంపై ఈ ప్రాంత రైతులను ప్రత్యేక వాహనాల్లో తీసుకెళ్లి అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఆ విధానంతో మూడు పంటలు పండించేందుకు రైతులకు పూర్తి అవగాహన వస్తే ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆ ట్రస్ట్ కార్యదర్శి మర్రి శశిధర్‌రెడ్డి, ప్రముఖ పర్యవేరణ వేత్త పురుషోత్తం రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఆర్. శివారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి, జలసాధన సమితి జిల్లా అధ్యక్షులు అనంత్‌రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపల్ సుదర్శన్‌రెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బంది కలిగించొద్దు

నారాయణపేట రూరల్: వివిధ గ్రామాల నుంచి పట్టణాలలోని విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఆర్టీసీ అధికారులు ఇబ్బందులు కలిగించకుండా చూడాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నరేష్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్యను కలిసి వినతిపత్రం అందించారు. పండుగలు, ప్రముఖుల పర్యటనల పేరుతో బస్సులను మళ్లించడం వల్ల విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరై హాజరు శాతం తగ్గిపోతుందని, భవిష్యత్తులో ఇలా జరగకుండా చూడాలన్నారు.

న్యూస్‌రీల్

అంబులెన్స్ సిబ్బంది అందుబాటులో ఉండాలి



నారాయణపేట: జిల్లాలోని మక్తల్, నారాయణపేట మండలం జీవీకే ఈఎంఆర్ఐ 1962 మొబైల్ వెటర్నరీ అంబులెన్స్‌లను గురువారం స్టేట్ ప్రాజెక్టు హెడ్ డాక్టర్ బగిష్ మిశ్రా ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని వివిధ పరికరాలు, వాటి పని తీరు, అదే విధంగా మందులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్ వచ్చిన వెంటనే 1962 సిబ్బంది తక్షణమే స్పందించి సేవలు అందించాలని, జిల్లాలో ప్రతి అంబులెన్స్ 10 ట్రిప్పులు, అదే విధంగా 20 పైన జంతువులకి వైద్య సేవలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పశువులకు వైద్య సహాయం కోసం 1962 సమాచారం అందించాలని, మా మొబైల్ వెటర్నరీ 1962 అంబులెన్స్ సిబ్బంది మీ దగ్గరికి వచ్చి పశువులకు తగిన శస్త్ర చికిత్స, మందులు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజర్ రవి, ఎగ్జిక్యూటివ్ రాఘవేందర్, డాక్టర్ వైష్ణవి,మురళి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

నారాయణపేట ఎడ్యుకేషన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఎనలేని కృషి చేస్తుందని రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్ అన్నారు. గురువారం జిల్లాలో ఎస్ఎఫ్ఐ మూడో మహాసభలు నిర్వహించగా.. జిల్లా అధ్యక్షుడు మోహన్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన కిరణ్ మాట్లాడుతూ.. నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయడం సరికాదని, ఈ మేరకు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడేందుకు ఎస్ఎఫ్ఐ నిరంతరం కృషి చేస్తుందని, విద్యార్థులను బోర్డు, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు పదో తరగతి టాలెంట్ టెస్ట్, ఇంటర్ విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో మోడల్ ఎంసెట్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులలో జాతీయ భావాలు పెంపొందించేలా జాతీయ నాయకుల జయంతులు, వర్ధంతులు, సమాజంపై అవగాహన కలిగించేందుకు పలు అంశాలపై సెమినార్లు, చర్చాగోష్టి, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించినట్లు వెల్లడించారు. త్యాగాలగడ్డపై 3వ జిల్లా మహాసభలు నిర్వహించడం ఎంతో హర్షించదగ్గ విషయమని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి నరహరి, జిల్లా నాయకులు మహేందర్, కాశీ, నరసింహా, నయీమ్, శ్రావణి, కవిత తదితరులు పాల్గొన్నారు.

శిథిలాల తొలగింపు షురూ

లోకో ట్రైన్ మూడు కోచ్‌ల ద్వారా మట్టి వెలుపలికి..



టన్నెల్‌లో సహాయక చర్యలు చేపట్టేందుకు సామగ్రితో వెళుతున్న రెస్క్యూ బృందాలు

- 20 మంది చొప్పున మూడు షిఫ్ట్‌లో పనిచేస్తున్న రెస్క్యూ బృందాలు
- ఈ ప్రక్రియ పూర్తయితేనే కార్మికుల జాడ
- ఆరు రోజులైనా మరమ్మతుకు నోచుకోని కన్వేయర్ బెల్ట్

అచ్చంపేట/ అచ్చంపేట రూరల్: శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులు ఇంకా బయటికి రాలేదు. టన్నెల్ నుంచి వారిని క్షేమంగా బయటికి తెచ్చే ఆపరేషన్ గురువారం మొదలైంది. సహాయక చర్యల్లో అధికారులు వేగం పెంచారు. లోకో ట్రైన్ మూడు డబ్బాల ద్వారా మట్టి శిథిలాలను తీసుకొచ్చారు. టీబీఎం మిషన్ ఉన్న ప్రాంతానికి లోకో ట్రైన్ పూర్తిగా చేరుకోలేకపోతోంది. 13.95 కి.మీ., వద్ద టీబీఎం మిషన్ ఉండగా చివరి వరకు లోకో ట్రైన్ వెళ్లేందుకు పట్టాలు ఉన్నాయి. అయితే భారీగా పేరుకుపోయిన మట్టి, బురద, సెగ్మెంట్లు, టీబీఎం శిథిలాల వల్ల టన్నెల్ చివరి వరకు లోకో ట్రైన్ వెళ్లలేకపోతోంది. ఈ రెండింటి మధ్య 300 మీటర్ల దూరం ఉంది. దీంతో టీబీఎం వరకు చేరుకునేందుకు లోకో ట్రైన్ పట్టాలు, సొరంగంలోని మట్టి, రాళ్లు, బురద తొలగించేందుకు కార్యాచరణను రెస్క్యూ బృందాలు చేపట్టాయి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే లోకో ట్రైన్ టీబీఎం చివరి వరకు చేరుకుంటుంది. ఆ తర్వాత టీబీఎం ఉన్న ప్రాంతంలోని శిథిలాలు తీసే పని మొదలవుతుంది. అప్పటివరకు టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికుల జాడ కనిపించే అవకాశం లేదు. ఈ ఆపరేషన్‌లో సింగరేణి బృందాలు కీలకంగా పని చేస్తున్నాయి. సొరంగం పైకప్పు కూలకుండా ప్రతిష్ఠమైన పునః నిర్మాణం చేస్తున్నారు. సింగరేణితో పాటు ఎన్‌డీఆర్ఎఫ్, ఆర్మీ, నేవీ, ర్యాట్ హోల్ మైనర్స్, ఇతర బృందాలు కలిపి 20 మంది చొప్పున మూడు షిఫ్టులుగా పనిచేస్తున్నారు. అయితే దెబ్బతిన్న కన్వేయర్ బెల్టు మరమ్మతు మాత్రం చేపట్టలేకపోతున్నారు. సొరంగం లోపలికి వెళ్లేందుకు లోకో ట్రైన్ ఒక్కటే ఉండటం వల్ల అందులోనే సిబ్బంది వేళ్తూ.. దానిలోనే మట్టి తీసుకురావడం వల్ల కొంత కష్టంగా మారింది. అయితే తెగిపోయిన కన్వేయర్ బెల్ట్, ఆక్సిజన్ పైపులు పునరుద్ధరిస్తే సహాయక చర్యలు మరింత వేగవంతం అవుతాయి.

ముమ్మరంగా డీవాటరింగ్

టన్నెల్‌లో ప్రతి నిమిషానికి 5 వేల లీటర్ల నీళ్లు ఊరుతోంది. కూలిన రెండోరోజు నుంచే డీవాటరింగ్ చేస్తున్నా అదుపులోకి రాలేదు. రెండు రోజుల క్రితం నుంచి 100 హెచ్‌పీ మోటార్లతో ముమ్మరంగా డీవాటరింగ్ చేయడంతో పూడిక ఉన్న ప్రాంతం వరకు వెళ్లి సహాయక చర్యలు చేపడుతున్నారు. అయితే సొరంగంలో చిక్కుకున్న వారి క్షేమంపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. ప్రభుత్వం వారిని ఎలాగైనా రక్షించి బయటికి తేవాలనే కృతనిశ్చయంతో సహాయక చర్యలు చేపడుతోంది.


ఎన్‌జీఆర్ఐ ప్రత్యేక బృందం..

సొరంగంలో శిథిలాల కింద చిక్కుకున్న మానవ శరీరాలు గుర్తించేందుకు ప్రత్యేకంగా ఎన్‌జీఆర్ఐ ప్రత్యేక బృందం గురువారం ఉదయం సహాయ చర్యలు చేపట్టింది. సొరంగంలో చిక్కుకున్న 8 మంది ఆచూకీ కనుగొనేందుకు ప్రత్యేకంగా గ్రౌండ్ ప్రోబింగ్ రాడార్ ఆంటీనాను ఉపయోగిస్తున్నారు. దీని ద్వారా వారి ఆచూకీ లభించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

కఠిన ఆంక్షలు..

ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రాంతానికి వెళ్లడానికి ఎవరికీ అనుమతి ఇవ్వడం లేదు. కనీసం మీడియాకు కూడా అనుమతి ఇవ్వలేదు. రాజకీయ నాయకుల సందర్శనను తిరస్కరిస్తున్నారు. కేవలం రెస్క్యూ ఆపరేషన్ బృందాలు, అధికారులకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. మరో 72 గంటల్లో సొరంగంలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకొస్తాం అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో టన్నెల్ వద్ద సహాయక చర్యలు వేగవంతం అయ్యాయి. టన్నెల్ చుట్టూ ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా ఉండేందుకు, భద్రతా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఆంక్షలు విధించారు.

టీబీఎం మిషన్ కటింగ్



టీబీఎం మిషన్‌ను కట్ చేసేందుకు జేపీ కంపెనీ సంస్థ యజమాని జయప్రకాష్ గౌర్ అనుమతి లభించింది. దీంతో గత అర్ధరాత్రి నుంచి గ్యాస్ కటింగ్ మిషన్‌తో టీబీఎంను కట్ చేసే పనులను వేగవంతం చేసినట్లు సమాచారం. ఇందులో 11 బృందాలతో పాటు ర్యాట్ హోల్ మైనర్స్ ప్రత్యేక నిపుణులు భాగస్వామ్యం అయ్యారు. ప్రమాద స్థలంసమీపానికి చేరుకొని పేరుకుపోయిన బురదను బయటికి పంపే చర్యలు చేపడుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు సొరంగంలో చేపడుతున్న సహాయక చర్యలు ఏ విధంగా కొనసాగుతున్నాయి.. అనే విషయాలను అధికార యంత్రం బయటికి పొక్కనివ్వడం లేదు.

మరికొన్ని వివరాలు..

- మధ్యాహ్నం 12.16 గంటలకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎస్ఎల్‌బీసీ జేపీ కార్యాలయం వద్ద ఉన్న హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు.
- 12.30 గంటలకు కార్యాలయానికి వచ్చారు. అంతకు ముందే కార్యాలయం ముందున్న మీడియా ప్రతినిధులను అక్కడి నుంచి గేటు బయటకు పోలీసులు పంపించారు.
- 2.16 గంటలకు బీఆర్ఎస్ మాజీ మంత్రులు హరీశ్ రావుతో పాటు పలువురు ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రాంతానికి వెళ్లారు. కొందరికే అనుమతి ఇవ్వడంతో రెండు కార్లలో ఉన్నవారు కొద్దిసేపు రోడ్డుపై బైఠాయించారు. 5 నిమిషాల తర్వాత సొరంగానికి పంపించారు. అక్కడి నుంచి వచ్చి ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు.

క్లుప్తంగా

వ్యక్తి అనుమానాస్పద మృతి

- పోలీసులకు ఫిర్యాదుచేసిన తల్లి

రాజాపూర్: అత్తగారింటికి వెళ్లి తన కుమారుడు మృతిచెందాడని.. మృతిపై అనుమానం ఉందని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. మండలంలోని మల్లేపల్లి గ్రామపంచాయతీ తిమ్మారెడ్డి కుంటతండాకు చెందిన సబావత్ గమ్లీ పెద్ద కుమారుడు తావుర్య (40) 25వ తేదీన ఫరూక్‌నగర్ మండలం రామేశ్వరం జాతరకు వెళ్తున్నట్లు చెప్పి రూ.5 వేలు తీసుకెళ్లాడు. భార్య తల్లిగారి ఊరైన జీడిగుట్టతండాలో ఉండటంతో అక్కడి వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో మామ వెంకటయ్య, అత్త అమ్ని 108 వాహనంలో తన కుమారుడి మృతదేహాన్ని తండాకు తీసుకొచ్చారని.. శివరాత్రి రోజు ట్రాక్టర్‌లో రామేశ్వరం వెళ్తుండగా అకస్మాత్తుగా మృతిచెందినట్లు చెప్పారన్నారు. కొడుకు మృతిపై అనుమానం ఉన్నట్లు తల్లి గమ్లీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

యువకుడు బలవన్మరణం

గద్వాల క్రైం: కుటుంబ అవసరాల కోసం తీసుకున్న అప్పులు చెల్లించలేక ఓ యువకుడు తీవ్ర మనస్థాపానికి గురై బలవన్మరణానికి పాల్పడిన ఘటన గద్వాల మండలం అనంతపురంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు ఎరుకలి పరశురాముడు (24) వృత్తిరీత్యా జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజుల కిందట తెలిసిన వ్యక్తులతో కుటుంబ అవసరాల కోసం అప్పు తీసుకున్నాడు. అప్పులను చెల్లించలేక గ్రామ శివారులోని డంపింగ్ యార్డు షెడ్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తండ్రి ఎల్లప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తునట్లు పేర్కొన్నారు.

ప్రేమించిన అమ్మాయి దక్కదని..

రాజోళి: ప్రేమించిన అమ్మాయి దక్కదని భావించి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రం రాజోళికి చెందిన నాగేష్(20) జులాయిగా తిరుగుతున్నాడు. ఓ అమ్మాయిని ప్రేమించాడు. ప్రేమించిన అమ్మాయి దక్కదని భావించి బుధవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కర్నూల్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి తల్లి బేబి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సెల్ టవర్ పేరుతో రూ.84లక్షలు మాయం

- ప్రభుత్వ ఉపాధ్యాయుడిని మోసగించిన సైబర్ కేటుగాళ్లు

మహబూబ్‌నగర్ క్రైం: సైబర్ నేరస్తులు చెప్పే మాయ మాటలు నమ్మి బాధితులు భారీగా నష్టపోతున్నారు. తాజాగా పాలమూరు పట్టణంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఉన్న ఖాళీ స్థలంలో సెల్‌టవర్ నిర్మించి నెలకు రూ.50వేల అద్దె చెల్లిస్తానని నమ్మించాడు. అతడి నుంచి సైబర్ కేటుగాళ్లు దశలవారీగా లక్షలు వసూలు చేశారు. వన్‌టౌన్ సీఐ అప్పయ్య తెలిపిన వివరాలు.. జిల్లా కేంద్రంలోని మదీన మజీద్ ఏరియాకు చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి 2023 అక్టోబర్ 10న ఆన్‌లైన్ ఏబీఎస్ టవర్ కంపెనీ పేరుతో ఒక మెసేజ్ వచ్చింది. మీకు ఖాళీ స్థలం ఉంటే దాంట్లో సెల్‌టవర్ నిర్మించి ప్రతి నెల రూ.50వేల అద్దె చెల్లిస్తామని చెప్పారు. దానికి కావాల్సిన డాక్యుమెంట్స్‌ను పంపించి ఉపాధ్యాయుడిని సైబర్ నేరగాళ్లు నమ్మించారు. దీంతో తనకు మహబూబ్‌నగర్‌లో ఓపెన్ ప్లాట్ ఉందని, దాంట్లో ఏర్పాటు చేయాలని చెప్పాడు. ఆతర్వాత ఆన్‌లైన్‌లో మొదట కొంతడబ్బు చెల్లించాలని సైబర్ నేరగాళ్లు సూచించడంతో ఉపాధ్యాయుడు అతని ఫోన్ నెంబర్ నుంచి రూ.లక్ష పంపించాడు. ఆతర్వాత దశల వారీగా అతని నుంచి ఆన్‌లైన్‌లో, ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ఇప్పటివరకు రూ.84లక్షలు వసూలు చేశారు. ఇటీవలే మోసపోయినట్లు గ్రహించిన ఉపాధ్యాయుడు గురువారం ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. భారీగా డబ్బులు పోవడంతో ఆరోగ్యం క్షీణించి బాధితుడు ఇబ్బందులు పడుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

మెసేజ్ లింకుతో రూ.2లక్షలు..

మదనాపురం: సైబర్ నేరగాళ్లు ఎవరినీ వదిలిపెట్టడం లేదు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు మోసపోతున్నారు. గురువారం సాయంత్రం మండల కేంద్రానికి రజినికాంత్ అనే వ్యాపారికి గుర్తు తెలియని నంబర్ నుంచి పీఎంకిసాన్ డబ్బులు వచ్చాయో లేదోనని వాట్సాప్ లింక్ మెసేజ్ పంపారు. అతను అది ఓపెన్ చేయగానే ఒక క్రెడిట్ కార్డు నుంచి లక్షా ముప్పై వేలు, మరో కార్డు నుంచి డెబ్బై వేలు డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే అతడు క్రెడిట్ కార్డులను బ్లాక్ చేసి సైబర్ క్రైం 1903కి ఫిర్యాదు చేశారు. నేరగాళ్లు అతడి ఖాతాను పరిశీలించి నిందితుడు బెంగళూరులో ఆన్‌లైన్ షాపింగ్ చేసినట్లు గుర్తించారు.

ఆదిదంపతుల కల్యాణ వైభోగం


అలంపూర్‌లో ఆది దంపతుల కల్యాణ మహోత్సవం


అలంపూర్‌లో బాలబ్రహ్మేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

- నంది వాహనంపై ఊరేగిన ఆదిదంపతులు
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు
- భక్త జనసందోహంగా క్షేత్ర ఆలయాలు


అలంపూర్‌లో నంది వాహనంపై ఉత్సవ మూర్తులు

అలంపూర్: దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్రంలో వెలిసిన ఆదిదంపతులు బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారి కల్యాణ మహోత్సవం గురువారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ఆదిదంపతుల కల్యాణ మహోత్సవం వీక్షించారు. ఈ సందర్భంగా బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పల్లకీ సేవలో 'హరహర మహాదేవ శంభో శంకర' అంటూ భక్తులు ప్రత్యేక మండపం వద్దకు తీసుకొచ్చారు. ఆలయ ఈఓ పురేందర్ కుమార్, చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి కల్యాణ వస్త్రాలను అర్చక స్వాములకు అందజేశారు. ఆగమ పండితులు కల్యాణ మహోత్సవం సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. వేదమంత్రాల మధ్య ఆదిదంపతుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేద పండితులు శివరాత్రి విశిష్టతను లింగోద్భవ ప్రాముఖ్యత, యామ పూజల అవశ్యకతను భక్తులకు వివరించారు. శివరాత్రిని పురస్కరించుకొని ఉపవాస దీక్షలో ఉన్న భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి దీక్ష విరమించారు.

లోక రక్షకుల ఊరేగింపు..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని లోక రక్షకులైన బాలబ్రహ్మేశ్వరస్వామి, జోగుళాంబ అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారు హంస వాహనంపై కొలువుదీర్చి పట్టణ ప్రధాన వీధులో విహరించారు. భక్తులు లోక రక్షకులకు అడుగడుగున స్వాగతం పలుకుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు..

మహాశివరాత్రి జాగరణకు విచ్చేసిన భక్తులతో అలంపూర్ క్షేత్ర ఆలయాలు భక్త జనసందోహంగా మారాయి. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ క్షేత్రానికి జాగరణకు వచ్చిన భక్తులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారి ఆలయ ప్రాంగణంలో భజనలు, సంకీర్తనలు, వీరశైవ సమాజం ఆధ్వర్యంలో నందికోళ్ల సేవ, పౌరాణిక నాటకం, తుంగభద్ర పుష్కర ఘాట్‌లో జానపద నాటికలు, పాటలు వంటి విశేష కార్యక్రమాలు నిర్వమించారు. లింగోద్భ కాలంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు పౌరాణిక నాటక ప్రదర్శనలు వీక్షించారు.


మహా శివరాత్రి జాగరణలో సాంస్కృతిక ప్రదర్శనలు

దక్షిణకాశీలో కనుల పండవగా రథోత్సవం


అలంపూర్‌లో రథోత్సవ ఉత్సవాలు



అలంపూర్: మహాశివరాత్రి వేడుకల్లో రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఆది దంపతులు కొలువుదీరిన రథాన్ని లాగుతూ ఉత్సవాలు కొనసాగించారు. హరహర మహా దేవ.. శంభో శంకరా..అంటూ భక్తులు రథాన్ని ముందుకు కదలించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం నిర్వహించుకోవడం ఇక్కడి అనవాయితీ. రథంపై ఆది దంపతులు బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారు కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై ఆలయాల నుంచి మేళతాలాలతో పల్లకీలో రథశాల దగ్గరికి తీసుకొచ్చారు. ఆలయ ఈఓ పురేందర్ కుమార్, ఆలయ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డిలు గుమ్మడి కాయ కొట్టి రథోత్సవం ప్రారంభించారు. రథోత్సవాన్ని వీక్షించడానికి వేలాదిగా భక్తులు తరలొచ్చారు. పురవీధుల్లో విద్యుత్ కాంతులతో రథం ముందుకు సాగింది. ఎస్ఐ వెంకటస్వామి సిబ్బందితో కలిసి భద్రత చర్యలు చేపట్టారు. రథోత్సవ విశిష్టితను అర్చక స్వాములు వివరించారు.

కలగానే సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్?

- బీఆర్ఎస్ పాలనలో రూ.8 కోట్లతో శంకుస్థాపన
- నేటికీ ముందుకుపడని అడుగులు
- నిర్మాణం పూర్తయితే అథ్లెట్లకు మెరుగైన శిక్షణ


మహబూబ్‌నగర్‌లోని ప్రధాన స్టేడియం

మహబూబ్‌నగర్ క్రీడలు: పాలమూరు క్రీడల హబ్ గా మారుతోంది. ప్రధాన స్టేడియంలో ఖో- ఖో, వాలీబాల్, లాంగ్‌జంప్, హైజంప్, బాస్కెట్‌బాల్ కోర్టులతో పాటు ఆర్చరీ జోన్ ఏర్పాటు చేశారు. వాలీబాల్ అకాడమీ ఏర్పాటు కాగా, అధునాతన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం అందుబాటులోకి వచ్చింది. అనేక క్రీడా సౌకర్యాలు కల్పించినప్పటికీ గత బీఆర్ఎస్ పాలనలో రూ.8 కోట్లతో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినా నేటికీ నిర్మాణ పనులు ప్రారంభం కావడం లేదు.

పరిశీలించిన కేంద్ర బృందం..

ఖేలో ఇండియా పథకంలో భాగంగా రాష్ట్రంలోని మెదక్, వరంగల్ జిల్లాల్లో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్‌లో జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో ప్రధాన స్టేడియంలో ఏర్పాటుకు గతంలో ప్రణాళికలు రూపొందించి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్)కు.. అటు నుంచి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్)కు ప్రతిపాదనలు పంపారు. 400 మీటర్ల పొడవు, 8 లైన్లతో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటుకుగాను 2021, అక్టోబర్ 22న ఖేలో ఇండియా కేంద్ర బృందం సభ్యులు మైదానాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం..



మెయిన్ స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలో మంజూరయ్యే అవకాశం ఉంది. ట్రాక్ ఏర్పాటు చేస్తే జిల్లాలోని అథ్లెట్లకు మెరుగైన శిక్షణ అందనుంది.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్ఓ, మహబూబ్‌నగర్

గత ప్రభుత్వ హయాంలో..

2023లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వ హయాంలో ప్రధాన స్టేడియంలో పలు అభివృద్ధి పనులతో పాటు రూ.8 కోట్లతో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కానీ నేటికీ పనులకు ముందడుగు పడనట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పనులు ప్రారంభించాలని పలువురు సీనియర్ క్రీడాకారులు కోరుతున్నారు.

ఔత్సాహిక క్రీడాకారులకు వరం..

జిల్లా అథ్లెట్లు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభచాటి పతకాలు సాధిస్తున్నారు. జిల్లాకేంద్రంలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటైతే గుర్తింపుతో పాటు జాతీయస్థాయి పోటీలు జరిగే అవకాశం ఉంటుంది. జిల్లా క్రీడాకారులు హైదరాబాద్‌కు వెళ్లకుండా ఇక్కడే ప్రాక్టీస్ చేసుకునే అవకాశం ఉంటుంది.

నీటి తరలింపుపై మంత్రి జూపల్లి మౌనం ఎందుకు?


మాట్లాడుతున్న పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి

వనపర్తి టౌన్: పాలమూరు జలాలను ఏదుల రిజర్వాయర్ నుంచి డిండికి తరలించడానికి గతంలో వ్యతిరేకించిన మంత్రి జూపల్లి కృష్ణారావు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవచారి ప్రశ్నించారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు జిల్లాకు కృష్ణానది నీటిలో న్యాయంగా దక్కాల్సిన వాటా దక్కడం లేదని, జిల్లా రైతులకు మొదటి నుంచి అన్యాయమే జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు గోస తెలిసిన రైతు బిడ్డ, జిల్లావాసి అయిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో ఇక్కడి రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయని, ఆ ఆశలకు అనుగుణంగా సీఎం ముందుకు సాగాలని హితవు పలికారు. గతంలో ఏ ప్రభుత్వం వచ్చినా పాలమూరు భూములను తడపలేకపోయాయని, ఇక్కడి కరువును తరమలేకపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా జలాల్లో నీటి వాటాపై బచావత్ ట్రిబ్యునల్‌తోనూ తాము 30 ఏళ్ల క్రితమే జిల్లా రైతుల డిమాండ్లను వినిపించామని గుర్తుచేశారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక సభ్యులు శాంతన్న, వెంకటేశ్వర్‌శెట్టి, యేసేపు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన గాలింపు

- 100 ఫీట్ల మేర నీటి తోడివేత
- రంగంలోకి ఎన్‌డీఆర్ఎఫ్ బృందం
- లభ్యం కాని విద్యార్థి ఆచూకీ


కోనేరులోకి క్రేన్‌తో వెళ్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

వెల్దండ: మండలంలో గుండాల అంబారామలింగేశ్వరస్వామి కోనేరులో గల్లంతైన విద్యార్థి ఆచూకీ కోసం రెండో రోజూ గాలింపు కొనసాగింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు కోనేరులో దాదాపు 100 ఫీట్ల నీటిని ఆరు మోటార్ల సాయంతో తోడేసిన విద్యార్థి ఆచూకీ మాత్రం లభ్యం కాలేదు. జిల్లా అధికారుల అదేశాల మేరకు ఎన్‌డీఆర్ఎఫ్ సీఐ కృష్ణాతావర్‌జీ బృందం 20మంది సభ్యులు, కేంద్ర బలగాలు గుండాల కోనేరుకు గురువారం మధ్యాహ్నం చేరుకున్నాయి. రిస్క్యూ ఆపరేషన్ బృందం అక్కడి ఎస్ఐతో వివరాలు తెలుసుకున్నారు. క్రేన్ సహయంతో ఎన్‌డీఆర్ఎఫ్ సభ్యుడు ఒకరు కోనేరులోకి వెళ్లి అక్కడ లోతును అంచనా వేశారు. మృతదేహం కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తిరిగి పైకి వచ్చారు. అనంతరం మరో ఇద్దరి సభ్యులు మరోసారి దాదాపుగా 100ఫీట్ల లోతులోని కోనేరులో వెళ్లారు. దాదాపుగా మూడు గంటల పాటు బురదలో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండాపోయింది. సాయంత్రం చీకటి పడడంతో తిరిగి సభ్యులు బయటకు వచ్చారు. శుక్రవారం కూడా గాలింపు చర్యలు చేపడతామని ఎన్‌డీఆర్ఎఫ్ బృందం వివరించింది. విద్యార్థి ఆచూకీ కోసం తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ ఎదురుచూస్తున్నారు. వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐలు కురుమూర్తి, నాయకులు భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, ఆలయ చైర్మన్ సందీప్‌రెడ్డి, వైస్ చైర్మన్ అరుణ్‌కుమార్, మోతిలాల్‌నాయక్, జంగయ్యయాదవ్, మట్ట వెంకటయ్యగౌడు, పర్వత్‌రెడ్డి, ఉన్నారు.

సహాయక చర్యల పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బలగాల సీఐ కృష్ణాతార్‌జీ

గుండాల కోనేరులో గల్లంతైన విద్యార్థి ఆచూకీ కోసం చేపట్టిన సహాయక చర్యలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, జేసీ అమరేందర్, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పరిశీలించారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ఎన్‌డీఆర్ఎఫ్ బృందానికి సూచించారు. కోనేరులోని పరిస్థితి విద్యార్థి అచూకి కోసం వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట మాజీ జెడ్పీటీసీ విజితారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పుట్టరాంరెడ్డి, వెంకటయ్యగౌడు, మధసూధన్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి,ఆనంద్, నరసింహ, అశోక్ ఉన్నారు.

పోక్సో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

దామరగిద్ద: పోక్సో కేసులో నిందితుడు బండగొండ నరేష్‌కు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.50 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ గురువారం తీర్పునిచ్చినట్లు ఎస్పీ యోగేష్ గౌతం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని పిడెంపల్లికి చెందిన బండగొండ నరేష్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ మండలానికి చెందిన ఓ బాలికను 2021, మార్చి 19న ముంబాయికి తీసుకెళ్లాడు. బాలిక తల్లిదండ్రులు అదే ఏడాది మార్చి 30న నారాయణపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా అప్పటి ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదుచేశారు. అప్పటి సీఐ శ్రీకాంత్‌రెడ్డి విచారణచేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. గురువారం పీపీ ఆకుల బాలప్ప కోర్టులో వాదనలు వినిపించి తగిన సాక్ష్యాధారాలు సమర్పించగా నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి తుది తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.5లక్షల పరిహారం ఇవ్వాలని తీర్పునిచ్చినట్లు ఎస్పీ వివరించారు.

పోక్సో కేసు నమోదు

మద్దూరు: మాయమాటలు చెప్పి విద్యార్థిని గర్భవతిని చేసిన యువకుడిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఓ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలిక మగశిశువుకు జన్మనిచ్చిన విషయం పాఠకులకు విదితమే. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు యువకుడు అనిల్‌నాయక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. అనిల్‌కుమార్ మహబూబ్‌నగర్‌లోని ఓ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్లు తెలిసింది.

అన్నదాతకు కాలుష్యం కష్టాలు

- సాగు, తాగునీరు కలుషితం..
- పట్టించుకోని పీసీబీ అధికారులు


సెజ్‌లోని ఓ పరిశ్రమ నుంచి వదులుతున్న నల్లటి కాలుష్యం

రాజాపూర్: అన్నదాతలను కాలుష్యం వెంటాడుతూనే ఉంది. యథేచ్ఛగా పగలు, రాత్రి తేడా లేకుండా పోలేపల్లి సెజ్‌లోని పరిశ్రమలు కాలుష్యం వదలుతుండటంతో ఇటు అన్నదాతలు, అటు గ్రామాల ప్రజలు, మూగజీవాలు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం తప్పడంలేదు. మండలంలోని రాయపల్లి, ముదిరెడ్డిపల్లి, జడ్చర్ల మండలంలో పోలేపల్లి, గుండ్లగడ్డ తండాలకు సమీపంలోని పరిశ్రమల నుంచి వదులుతున్న వాయు కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో వర్షపునీటి సాకుతో కాలుష్య జలాలు వదులుతుండటంతో ఇప్పటికే పంటలు పండక, వ్యవసాయ బోర్లు కాలుష్యమై తాగడానికి, సాగుకు ఉపయోగపడడం లేదు. ఈ విషయంపై సమీప గ్రామాల ప్రజలు ఎన్నో పర్యాయాలు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై రెండు సార్లు అసెంబ్లీలో స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రస్తావించినా అధికారులు పెడచెవిన పెట్టారు. పరిశ్రమల పక్కనే విద్యాసంస్థ విద్యార్థులు వాయు, శబ్ద కాలుష్యం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన చిన్నారెడ్డి


సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నా రెడ్డి

వనపర్తి: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి గురువారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అభివృద్ధి పనుల వినతిపత్రాన్ని అందజేశారు. మార్చి 2న జిల్లాకు సీఎం వస్తున్న సందర్భంగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల అంశాలపై వినతిపత్రం అందజేశానని.. ఆయన సానుకూలంగా స్పందించినట్లు చిన్నారెడ్డి వివరించారు. వనపర్తిలో పూర్వ విద్యార్థులతో ముఖ్యమంత్రి సమావేశం అవుతారని.. అనంతరం అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసి బహిరంగసభకు హాజరవుతారని చెప్పారు.

చిరుత దాడిలో దూడ మృత్యువాత

- ఆశ్రమ పాఠశాల పక్కన సంఘటన
- భయాందోళనలో విద్యార్థులు


లింగాల: చిరుత దాడిలో మృతి చెందిన గేదె దూడ

లింగాల: మండలంలోని క్యాంపు రాయవరం గిరిజన ఆశ్రమ పాఠశాల సమీపంలో బుధవారం రాత్రి చిరుత సంచారం విద్యార్థులను భయాందోళనకు గురి చేసింది. గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ పొలంలోని పశువుల పాకలో ఉన్న దూడపై దాడి చేయడంతో మృత్యువాత పడింది. చిరుత పాఠశాల పక్కనే సంచరించడంతో పాఠశాల లోపలికి వస్తే పరిస్థితి ఎంటని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాల అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండడంతో తరచుగా అడవి జంతువులు సంచరిస్తుంటాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని అటవీ శాఖ బీట్ ఆఫీసర్ ఖాదర్‌పాషా పరిశీలించారు. ఈ ప్రాంతంలో చిరుత సంచరించినది వాస్తవమేనని తెలిపారు. వేసవిలో అడవి జంతువులు తాగునీటి కోసం గ్రామాల వైపు వస్తుంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ పొలాల దగ్గర పశువులను, గేదెలను ఉంచరాదని బీట్ ఆఫీసర్ సూచించారు.